

రాయలసీమ దరువు

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

APTEL/26/A7874

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | ఆదివారం 15 నవంబర్ 2026 | సంపుటి : 01, సంచిక : 53 | పేజీలు : 04, వెల రూ.2

ట్రైన్ టికెట్ ఒకటే - కానీ దేశమంతా తిరగొచ్చు



సాధారణంగా ఏదైనా ట్రైన్ టికెట్ తీసుకుంటే ఒకసారితో దాని గడువు ముగిసిపోతుంది. కానీ ఇండియన్ రైల్వే అందిస్తోన్న ఈ స్పెషల్ ట్రైన్ టికెట్ 56 రోజులపాటు చెల్లుతుంది.

ఢిల్లి : దేశంలో రోజూ లక్షల సంఖ్యలో ప్రజలు రైళ్లలో ప్రయాణాలు చేస్తుంటారు. సుదూర ప్రయాణాల కోసం ఎక్కువ మంది ట్రైన్ జర్నీకే ఓటేస్తారు. ఎందుకంటే తక్కువ ఖర్చుతో గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంది. అయితే సాధారణంగా రైలులో ప్రయాణం చేయాల్సివచ్చినప్పుడు, వెళ్లాల్సిన గమ్యానికి మిగతా..2లో

రాహుల్ గాంధీ హామీలన్నీ గాలి మాటలే



గిగ్ వర్కర్లకు ఆరోగ్య భద్రత కల్పిస్తామనడం పెద్ద జోక్ అంటూ బండి సంజయ్ ఎద్దేవా

కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలు గాలి మూటలుగా మిగిలిపోయాయని విమర్శ

గతంలో ఇచ్చిన వరంగల్, కామారెడ్డి డిక్లరేషన్ల అమలు ఏమైందో ప్రజలకు చెప్పాలని డిమాండ్

హైదరాబాద్: హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించిన గిగ్ వర్కర్ల సంక్షేమ పథకంపై కేంద్ర హోంశాఖ సహాయ మిగతా..2లో

కాకినాడ మేయర్ పీఠంపై ఉత్కంఠ..
వైసీపీ అభ్యర్థి ఖరారు..



- కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలపై పెరిగిన రాజకీయ వేడి
- మేయర్ అభ్యర్థిగా కాద సత్యశ్రీని ప్రకటించిన వైసీపీ
- పొత్తులో భాగంగా జనసేనకు దక్కిన కాకినాడ మేయర్ సీటు
- అభ్యర్థి ఎంపికపై జనసేనలో కొనసాగుతున్న కసరత్తు
- ఇరు పక్షాలకూ ప్రతిష్ఠాత్మకంగా మారిన ఎన్నికల పోరు

అంతరిక్ష రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే కీలక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం


- 'సీఐఐ భాగస్వామ్య సదస్సు కక్ష్య నుంచి అవకాశాల దిశగా భారతదేశ నూతన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ' అంశంపై జరిగిన ప్రత్యేక చర్చలో నారా లోకేశ్ పాల్గొన్నారు.
- అంతరిక్ష రంగంపై లోకేశ్ చర్చ



అంతరిక్ష రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే కీలక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. స్పేస్ ఎకానమీ చుట్టూ సమగ్ర ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. రాకెట్ విడిభాగాల తయారీ సంస్థలను అంతరిక్ష కంపెనీలతో అనుసంధానిస్తామని చెప్పారు. డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ స్పీడ్ ఏపీ తమ ప్రత్యేకతలని స్పష్టం చేశారు. 'సీఐఐ భాగస్వామ్య సదస్సు కక్ష్య నుంచి అవకాశాల దిశగా భారతదేశ నూతన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ' అంశంపై జరిగిన ప్రత్యేక చర్చలో నారా లోకేశ్ పాల్గొన్నారు. అంతరిక్ష రంగాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా నియంత్రిస్తున్నప్పటికీ ఈ రంగంలో రాష్ట్ర ప్రభుత్వాలు కీలక పాత్ర పోషించగలవని వివరించారు. ముందుగా ఒక రంగాన్ని ఎంపిక చేసుకుని అందులో పనిచేస్తున్న సంస్థలు, భాగస్వాములను గుర్తించాలన్నారు. క్రమపద్ధతిలో పెట్టుబడులను ఆకర్షించి ఆయా కంపెనీలను రాష్ట్రానికి తీసుకురావడమే తమ విధానమని చెప్పారు. దీన్నే వర్టికల్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్‌గా అభివర్ణించారు. వర్టికల్ ఇంటిగ్రేషన్‌లో భాగంగా స్మైరూట్ వంటి సంస్థలకు అవసరమైన విడిభాగాలు, ఉపవ్యవస్థలను తయారుచేసే కంపెనీలను ఒకే వ్యవస్థలోకి తీసుకురావాలని మిగతా..2లో

కోస్తాంధ్రకు తుపాను హెచ్చరిక..

18 నుంచి భారీ వర్షాలు!



- బంగాళాఖాతంలో క్రమంగా బలపడుతోన్న అల్పపీడనం
- నవంబర్ 16 సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం
- కోస్తాంధ్ర, ఒడిశాలలో 18, 19 తేదీల్లో భారీ వర్షాల సూచన
- సముద్రంలోకి వెళ్లవద్దని మత్స్యకారులకు హెచ్చరిక
- నవంబర్ 15 నాటికి తీరానికి తిరిగి రావాలని అధికారుల సూచన

అమరావతి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మిగతా..2లో

రాజకీయాల్లో పోటీ..
అభివృద్ధిలో సహకారం

మోదీతో సాన్నిహిత్యంపై డీకే శివకుమార్

- అభివృద్ధి పనుల విషయంలో కేంద్రంతో కలిసి పనిచేస్తామన్న డీకే శివకుమార్
- మోదీతో తనకు సత్సంబంధాలు ఉన్నాయంటూ జరుగుతున్న చర్చలపై స్పందన
- రాజకీయాలను, అభివృద్ధిని వేర్వేరుగా చూడాలని వ్యాఖ్య
- పలు కార్యక్రమాల్లో మోదీతో శివకుమార్ సరదాగా మాట్లాడటంతో రాజకీయ వర్గాల్లో చర్చ
- రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలను ప్రస్తావించానని వెల్లడి



ఢిల్లి : రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ అభివృద్ధి పనుల విషయంలో కేంద్రంతో కలిసి పనిచేస్తామని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తనకు సత్సంబంధాలు ఉన్నాయంటూ జరుగుతున్న చర్చలపై స్పందిస్తూ.. రాజకీయాలను, అభివృద్ధిని వేర్వేరుగా చూడాలని వ్యాఖ్యానించారు. "రాజకీయాల్లో పోటీ పడతాం.. అభివృద్ధిలో సహకరించుకుంటాం" అని పేర్కొన్నారు.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుంది



భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చాలా సమస్యలు పరిష్కారమయ్యాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.

ఢిల్లి : భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందం గురించి విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందానికి సంబంధించి సుంకాలతో సహా చాలా సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. మిగిలిన కొన్ని అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయని వివరించారు. త్వరలోనే ఈ ఒప్పందం ఖరారు కావొచ్చని వెల్లడించారు. మిగతా..2లో

విదేశీ ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు
చైనా విదేశీ పౌరులను నిర్బంధిస్తోందన్న నివేదిక

- ఈ విధానాన్ని 'హోస్టేజ్ డిప్లామసీ'గా అభివర్ణన
- చెక్, అమెరికా, జపాన్, బ్రిటన్ పౌరులు సహా పలువురు ఈ తరహా చర్యలకు గురి
- సేఫ్‌గార్డ్ డిఫెండర్స్ సంస్థ వ్యవస్థాపకుడు పీటర్ డాలిన్ విశ్లేషణ
- వెలుగులోకి వచ్చిన ఘటనలు వాస్తవ సంఖ్యలో కొంత భాగమేనని వెల్లడి



ఢిల్లి : ఇతర దేశాల ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు చైనా విదేశీ పౌరులను నిర్బంధిస్తోందా? వారిని దౌత్యపరమైన బేరసారాలకు సాధనంగా ఉపయోగించుకుంటోందా? చైనాలో విదేశీయులను అదుపులోకి తీసుకుంటున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీజింగ్ అనుసరిస్తున్న ఈ వైఖరిని 'హోస్టేజ్ డిప్లామసీ'గా ఓ నివేదిక అభివర్ణించింది. చైనా పోలీసులు, దేశ భద్రతా మంత్రిత్వ శాఖ (ఎంఎస్ఎస్) విదేశీ పౌరులను లక్ష్యంగా చేసుకుంటున్న తీరు అందోళన కలిగిస్తోందని 'ది డిప్లొమాట్'లో ప్రచురితమైన కథనం పేర్కొంది. ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన ఘటనలు వాస్తవ పరిస్థితికి చిన్న భాగం మాత్రమే కావచ్చని నివేదిక అభిప్రాయపడింది. విదేశీ పౌరులను తమ విదేశాంగ విధానానికి మిగతా..2లో

తెలంగాణ ప్రజలకు
రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి



- హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని నిలదీసిన కేటీఆర్
- కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో అబద్ధాల పుట్ట అంటూ ఎక్స్ వేదికగా ధ్వజం
- 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల అమలుపై సూటి ప్రశ్నలు

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో రాష్ట్ర ప్రజలకు రాహుల్ గాంధీ వెంటనే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో 'అభయ హస్తం'

తెలంగాణ గిగ్ వర్కర్లకు గుడ్‌న్యూస్..
రూ.5 లక్షల బీమా, రూ.10 లక్షల వైద్యం

- సంక్షేమ పథకాన్ని రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి కలిసి ప్రారంభం
- ఈ పథకం కింద రూ.5 లక్షల జీవిత బీమా
- రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం
- హైదరాబాద్‌లో జరిగిన సభకు ముందు గిగ్ వర్కర్ల భారీ బైక్ ర్యాలీ
- అనంతరం గిగ్ వర్కర్లతో రాహుల్ ముఖాముఖి



హైదరాబాద్: తెలంగాణలో గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. వారికి రూ.5 లక్షల జీవిత బీమాతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం అందించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని జయభేరీ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన సభలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కలిసి 'తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకం' విధివిధానాలను ఆయన ప్రారంభించారు.

గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గిగ్ వర్కర్లు కష్టానికి తగిన ఆదాయం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రాహుల్ గాంధీని కలిసిన గిగ్ వర్కర్లు తమకు చట్టపరమైన రక్షణ, గుర్తింపు లేదని సమస్యలు వివరించారని గుర్తుచేశారు.

రాహుల్ గాంధీ నాయకత్వం కోసం
దేశం ఎదురుచూస్తోంది



- రాహుల్ గాంధీ నాయకత్వం కోసం దేశం ఎదురు చూస్తోందని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.
- ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్ 2వ ఎడిషన్' కార్యక్రమంలో మాట్లాడారు.

హైదరాబాద్, నవంబర్ 14: రాహుల్ గాంధీ నాయకత్వ లక్షణాల గురించి ప్రపంచం మాట్లాడుకుంటోందని.. దేశం ఆయన నాయకత్వం కోసం ఎదురు చూస్తోందని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

తెలంగాణ గిగ్ వర్కర్లకుఈడ్న్యూస్..
రూ.5 లక్షల బీమా, రూ.10 లక్షల వైద్యం

వారికి న్యాయం చేస్తామని అప్పట్లో రాహుల్ హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. వివిధ రంగాలకు చెందిన పలువురి అభిప్రాయాలు, సలహాలు తీసుకున్న తర్వాతే ఈ చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటమే కాంగ్రెస్ పార్టీ విధానమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

బైక్ ర్యాలీలో పాల్గొన్న రాహుల్, రేవంత్

సభకు ముందు శిల్పకళా వేదిక నుంచి జయభేరీ గ్రౌండ్స్ వరకు గిగ్ వర్కర్లు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జయభేరీ గ్రౌండ్స్‌లో రాహుల్ గాంధీ గిగ్ వర్కర్లతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలు, డిమాండ్లను నేరుగా అడిగి తెలుసుకున్నారు.

రాహుల్ గాంధీ నాయకత్వం
కోసం దేశం ఎదురుచూస్తోంది

ఈ మేరకు హైదరాబాద్ వేదికగా నిర్వహించిన 'భారత్ సమ్మిట్'లో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ వేదికగా నవంబర్ 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన 'భారత్ సమ్మిట్'లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన తెలంగాణ అభివృద్ధి, రాహుల్ గాంధీ నాయకత్వ లక్షణాల గురించి మాట్లాడారు. 'రాహుల్ గాంధీ నాయకత్వం కోసం దేశం ఎదురు చూస్తోంది. ఆయన నాయకత్వ లక్షణాల గురించి ప్రపంచం గొప్పగా మాట్లాడుకుంటోంది. ఆయన నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిని ప్రపంచం గమనిస్తోంది' అని మంత్రి పేర్కొన్నారు. భారత్ సమ్మిట్‌లో రెండు రోజుల పాటు అర్థవంతమైన చర్చలు జరిగాయని మంత్రి ఉత్తమ్ కుమార్ తెలిపారు. సమ్మిట్‌లో జస్టిస్, డెమోక్రసీ అంశాలపై ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలిపారన్నారు. దానితో పాటు సంక్షేమం, సోషల్ జస్టిస్, జెండర్ జస్టిస్‌పై దీర్ఘంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు.

తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి

పచ్చి అబద్ధాల పుట్ట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో హైదరాబాద్‌లో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ... కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీలపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా రూ. 1 లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి, మూడేళ్లలో రూ. 5,000 కోట్లు కూడా కేటాయించలేదని కేటీఆర్ ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని కూడా గాలికి వదిలేశారని మండిపడ్డారు. అలాగే ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి, కేవలం 10 వేల ఉద్యోగాలతో సరిపెట్టారని విమర్శించారు. విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డులు, పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షల చొప్పున ఇచ్చే అంబేద్కర్ అభయ హస్తం సాయం, మైనార్టీల నిధుల కేటాయింపుల్లోనూ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులు, రైతుల సమస్యలపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ నిలదీశారు.

భారత్-అమెరికా వాణిజ్య
ఒప్పందం తుది దశకు చేరుకుంది

వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరుకున్నాయని స్పష్టం చేశారు. మిగిలిన సమస్యలలో చాలా వరకు మన వైపు ఉన్నవి కావని, అమెరికా వైపు నుంచే ఎక్కువ మార్పులు జరగాల్సి ఉందని చెప్పారు. 'హెచ్‌టీ లీడర్‌షిప్ సమ్మిట్'లో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్ ఈ మేరకు మాట్లాడారు.

విదేశీయులను అడ్డుపెట్టుకుని ఒత్తిడి..
చైనా 'హోస్టేజ్ డిప్లొమసీ'పై చర్చ

ఉపయోగపడే సాధనాలుగా భావించినప్పుడు వారిని నిర్బంధించేందుకు చైనా అధికారులు మరింత వెనుకాడటం లేదని తెలిపింది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన ఓ పౌరుడిని చైనా పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనను సేఫ్‌గార్డ్ డిఫెండర్స్ సంస్థ వ్యవస్థాపకుడు పీటర్ డాలిన్ ప్రస్తావించారు. చైనా గూఢచారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని విడుదల చేయాలని చెక్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే ఇది జరిగి ఉండొచ్చని పేర్కొన్నారు. అమెరికాకు చెందిన ఇద్దరు పౌరులు, జపాన్‌కు చెందిన ఇద్దరు వ్యాపారవేత్తలు కూడా చైనా అధికారుల చర్యలకు గురైనట్లు తెలిపారు. అరుదైన ఖనిజాల రంగంలో పనిచేస్తున్న జపాన్ వ్యాపారవేత్తలను అదుపులోకి తీసుకున్నారని వివరించారు. ఓ బ్రిటిష్ పౌరుడు జైలు నుంచి విడుదలైన విషయం ఇటీవలే బయటపడిందని, ఓ చైనా జర్నలిస్టు ఆచూకీ, పరిస్థితి ఇప్పటికీ తెలియరాలేదని వెల్లడించారు. చైనా న్యాయవాదులు, జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు కూడా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వీరంతా సాధారణ అరెస్టు లేదా నిర్బంధానికి గురైనవారు మాత్రమే కాదని డాలిన్ పేర్కొన్నారు. నిర్దేశిత ప్రదేశంలో, వారిని బయటి ప్రపంచానికి తెలియకుండా ఉంచుతున్నారని ఆరోపించారు. గతంలో తాను కూడా ఈ విధానానికి బాధితుడినని వెల్లడించారు. చైనా కమ్యూనిస్ట్ పార్టీ ఈ విధానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తోందని డాలిన్ అభిప్రాయపడ్డారు. విదేశీ పౌరులను ఇతర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు ఉపయోగించుకోవడమే ఈ ధోరణిలోని అసలు ఆందోళనకర అంశమని పేర్కొన్నారు.

ట్రైన్ టికెట్ ఒకటే - కానీ దేశమంతా తిరగొచ్చు

ఒక టికెట్, రావడానికి మరో టికెట్, ఇతర ప్రదేశాలకు వెళ్తే ఇంకో టికెట్ బుక్ చేసుకుంటాం. ఇది అందరికి తెలిసిన విషయమే. కానీ ఇండియన్ రైల్వే అందిస్తోన్న సర్క్యులర్ జర్నీ టికెట్ గురించి మీకు తెలుసా? ఎందుకంటే ఈ టికెట్ ద్వారా ఏకంగా 56 రోజుల పాటు రైలులో ప్రయాణించవచ్చు. అసలేంటి ఈ టికెట్? దీనిని ఎలా బుక్ చేసుకోవాలి? అనే వివరాలను తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే. విహార యాత్రలు, తీర్థ యాత్రలతో పాటు వివిధ పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు సర్క్యులర్ జర్నీ టికెట్ సౌకర్యవంతంగా ఉంటుంది. ఈ విధానం ఎప్పటి నుంచో అందుబాటులో ఉంది. కానీ ఈ విషయం చాలా మందికి తెలియదు. ఈ టికెట్ కోసం రైల్వే రిజర్వేషన్ కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించాలి. ఎంపిక చేసుకునే స్టేషన్ నుంచి ప్రయాణం ప్రారంభించి తిరిగి అదే స్టేషన్‌లో ముగిసేలా ఈ టికెట్‌ను రైల్వే శాఖ జారీ చేస్తుంది. ఉదాహరణకు మీరు విజయవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం, భువనేశ్వర్ మీదుగా హౌరా, గయ, వారణాసి, ప్రయాగ్‌రాజ్ తదితర ప్రాంతాలు సందర్శించి తిరిగి విజయవాడ చేరుకోవచ్చు. పండగల నేపథ్యంలో ప్రయాణాలు ఎక్కువగా చేసేవారు, టూర్లకు వెళ్లాలనుకున్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోచ్చని రైల్వే కమర్షియల్ అధికారులు సూచించారు. మరోవైపు వేర్వేరు ప్రాంతాలకు టికెట్లు కొనుగోలు చేయడం కంటే ఈ సర్క్యులర్ టికెట్ ధర తక్కువగా ఉంటుంది. బుకింగ్ సమయంలో గమ్యం, ప్రయాణం ఆధారంగా టికెట్ ధర ఉంటుంది. ప్రయాణంలో ఎనిమిది నగరాలు, స్టేషన్లలో ఎక్కొచ్చు, దిగొచ్చు. గరిష్ఠంగా వేర్వేరు స్టేషన్ల వద్ద ఆగుతూ తిరిగి బయల్దేరిన స్టేషన్‌కే చేరుకోవచ్చు. ప్రయాణంలో అవసరానికి తగ్గట్టుగా వేర్వేరు రైళ్లు మారొచ్చు. ప్రయాణించే దూరాన్ని బట్టి రోజులను లెక్కిస్తారు. సగటున రోజుకు 400 కిలోమీటర్ల ప్రయాణం, ప్రయాణించని రోజులకు 200 కిలోమీటర్ల లెక్కన పరిగణిస్తారు. 56 రోజుల వరకు చెల్లుతుంది : సీనియర్ సిటిజన్లకు కనిష్ఠంగా 1000 కిలోమీటర్ల వరకు నిబంధనల ప్రకారం రాయితీలు వర్తిస్తాయి. రైల్వే నిబంధనల ప్రకారం సర్క్యులర్ జర్నీ 56 రోజుల వరకు చెల్లుతుంది. అన్ని తరగతుల్లో టికెట్లు లభ్యమవుతాయి. వ్యక్తిగత ప్రయాణికులు లేదా గ్రూపులుగా ప్రయాణించే వారు దీనిని తీసుకోవచ్చు. అయితే ఈ టికెట్‌ను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేయడానికి వీలుండదు. సమీపంలోని రైల్వే రిజర్వేషన్ కేంద్రాలకు వెళ్లాలి. అక్కడ స్టేషన్ మాస్టర్, రైల్వే రిజర్వేషన్ సూపర్‌వైజర్‌కు దరఖాస్తు చేయాలి. ప్రయాణించాలనుకున్న ప్రాంతం పూర్తి వివరాలు, ప్రారంభ స్టేషన్, మధ్యలో స్టేషన్లు, చివరి గమ్యస్థానం, ప్రయాణ తేదీ తదితర పూర్తి వివరాలు తెలియజేయాలి. ఇతర వివరాల కోసం ఇండియన్ రైల్వే అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

రాహుల్ గాంధీ హామీలన్నీ గాలి మాటలే



మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ నోట పలికేవన్నీ గాలి మాటలేనని ఆయన విమర్శించారు. గిగ్ వర్కర్లకు ఆరోగ్య భద్రత కల్పిస్తామని రాహుల్ గాంధీ చెప్పడం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్, కాంగ్రెస్ పార్టీ తీరుపై నిప్పులు చెరిగారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు ఇప్పటివరకు గాలి మూటలుగానే మిగిలిపోయిన మాట వాస్తవం కాదా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన వరంగల్, కామారెడ్డి డిక్లరేషన్‌ల అమలు ఏమైందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత హామీలను నెరవేర్చకుండా పక్కనపెట్టేసి, ఇప్పుడు కొత్తగా మరో హామీ ఇవ్వడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఆరోగ్యశ్రీ పథకానికి నిధులు సరిగ్గా కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఇచ్చిన హెల్త్ కార్డులు కూడా ఆసుపత్రులలో సరిగ్గా పనిచేయడం లేదని ఆయన గుర్తుచేశారు. ఉన్న పథకాలకే దిక్కులేకుండా చేసి, కొత్తగా గిగ్ వర్కర్లకు బీమా, ఆరోగ్య భద్రత కల్పిస్తామంటే ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరని సంజయ్ స్పష్టం చేశారు.

కోస్తాంధ్రకు తుపాను హెచ్చరిక.. 18 నుంచి భారీ వర్షాలు!

మొదటి పేజి తరువాయి



మరింత బలపడుతూ కోస్తాంధ్ర, ఒడిశా తీరాల వైపు కదులుతోంది. ఇది రానున్న 48 గంటల్లో తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో నవంబర్ 18, 19 తేదీల్లో కోస్తాంధ్ర, ఒడిశా తీర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో, అండమాన్ సముద్రానికి ఆనుకుని ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా ఈ అల్పపీడనం కేంద్రీకృతమైంది. ఇది వాయవ్య దిశగా ప్రయాణిస్తూ నవంబర్ 15వ తేదీ ఉదయానికి వాయుగుండంగా, ఆ తర్వాత మరింత తీవ్రమై నవంబర్ 16 సాయంత్రం నాటికి మధ్య బంగాళాఖాతంలో తుపానుగా రూపాంతరం చెందుతుందని ఐఎండీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ వ్యవస్థ కారణంగా అండమాన్ నికోబార్ దీవుల్లో నవంబర్ 16 వరకు భారీ వర్షాలు కొనసాగుతాయని తెలిపారు.

మత్స్యకారులకు తీవ్ర హెచ్చరికలు

తుపాను నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల ఉద్ధృతి తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు నవంబర్ 15వ తేదీలోగా సురక్షితంగా తీరానికి తిరిగి రావాలని స్పష్టం చేసింది. అలాగే, మత్స్యకారులు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు సముద్రంలోకి వెళ్లరాదని కఠిన హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా నవంబర్ 17 వరకు అండమాన్ సముద్రంలోకి, నవంబర్ 15 నుంచి 18 వరకు ఆగ్నేయ బంగాళాఖాతంలోకి, నవంబర్ 16 నుంచి 19 వరకు మధ్య బంగాళాఖాతంలోకి వేటకు వెళ్లడం అత్యంత ప్రమాదకరమని అధికారులు సూచించారు. ఇటీవలే 'అర్నాబ్', 'మురసు' తుపానులు ఆంధ్రప్రదేశ్, ఒడిశా సహా పలు రాష్ట్రాల్లో తీవ్ర నష్టాన్ని సృష్టించిన విషయం తెలిసిందే. ఈ అనుభవాల దృష్ట్యా తాజా హెచ్చరికలను తీవ్రంగా పరిగణించి, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ సూచనలను పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాకినాడ మేయర్ పీఠంపై ఉత్కంఠ.. వైసీపీ అభ్యర్థి ఖరారు..

మొదటి పేజి తరువాయి



అమరావతి : రాష్ట్రంలో స్థానిక ఎన్నికల సందడి కొనసాగుతుండగా, అందరి దృష్టి ఇప్పుడు కాకినాడ కార్పొరేషన్‌పై కేంద్రీకృతమైంది. ఈ నెల 26న పోలింగ్ జరగనున్న ఈ ఎన్నికలు అధికార, ప్రతిపక్షాలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఓవైపు వైసీపీ వ్యూహాత్మకంగా తమ మేయర్ అభ్యర్థిని ప్రకటించి ప్రచారంలోకి దూకాలని చూస్తుండగా, మరోవైపు కూటమిలో భాగమైన జనసేన పార్టీలో అభ్యర్థి ఎంపికపై తీవ్ర కసరత్తు జరుగుతోంది. ఈ పరిణామాలు కాకినాడ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. కాకినాడ మేయర్ పీఠాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న వైసీపీ, ఆ దిశగా వేగంగా పావులు కదిపింది. నగరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ కాద వెంకటరమణ తన కుటుంబంతో సహా మాజీ ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో పార్టీలో చేరారు. ఇదే అదనుగా, ఆయన కుటుంబానికి చెందిన కాద సత్యశ్రీని కాకినాడ వైసీపీ మేయర్ అభ్యర్థిగా జగన్ ప్రకటించారు. నగరంలో మంచి పేరున్న వైద్యుల కుటుంబం కావడం, సామాజిక సమీకరణాల్లో భాగంగా బలమైన శెట్టి బలిజ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వడంతో వైసీపీ కొత్త రాజకీయ లెక్కలకు తెరతీసింది. దీంతో వార్డు అభ్యర్థులు కూడా నామినేషన్లకు సిద్ధమవుతున్నారు. మరోవైపు, కూటమి పొత్తుల్లో భాగంగా కాకినాడ మేయర్ స్థానం జనసేన పార్టీకి దక్కింది. అయితే, పార్టీ నుంచి ఎవరు బరిలోకి దిగుతారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతం జనసేన తరపున గుత్తుల వెంకట శుభ, చొల్లంగి సుబ్బలక్ష్మి, కడలి ఈశ్వరి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అయితే, కాకినాడ మేయర్ పదవిని తీసుకోవాలా? లేక దానికి బదులుగా తూర్పు గోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి మారాలా? అనే దానిపై జనసేన పార్టీలో అంతర్గతంగా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. కాకినాడను తమ కంచుకోటగా భావించే జనసేన, ఈ ఎన్నికల్లో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తోంది. తొలి విడత మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించిన నేపథ్యంలో, కాకినాడ కార్పొరేషన్‌ను గెలవడం వైసీపీకి అత్యంత కీలకంగా మారింది. అదే సమయంలో తమ పట్టు నిలుపుకోవాలని కూటమి భావిస్తోంది. ఇటీవల కార్పొరేషన్‌లో విలీనమైన ఆరు కొత్త పంచాయతీల ఓటర్లు ఈ ఎన్నికల్లో నిర్ణయాత్మక పాత్ర పోషించనున్నారు. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వ్యూహ ప్రతివ్యూహాలతో కాకినాడ మేయర్ ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది.

రాజకీయాల్లో పోటీ.. అభివృద్ధిలో సహకారం: మోదీతో సాన్నిహిత్యంపై డీకే శివకుమార్

మొదటి పేజి తరువాయి



బెంగళూరులో శుక్రవారం పింక్‌లైన్ మెట్రో ప్రారంభోత్సవం సహా పలు కార్యక్రమాల్లో మోదీతో శివకుమార్ సరదాగా మాట్లాడటం, సన్నిహితంగా మెలగడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. దీనిపై శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ఆ సందర్భాలను ఎవరికి నచ్చినట్లు వారు అర్థం చేసుకోవచ్చని అన్నారు. ప్రజాప్రతినిధిగా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలను ప్రస్తావించానని తెలిపారు. మేకెదాటు ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు ఇప్పించాలని మోదీని కోరినట్లు శివకుమార్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని, రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు అఖిలపక్ష బృందంతో ఢిల్లీ వెళ్లేందుకు అంగీకరించాయని చెప్పారు. అటవీ, పర్యావరణ అనుమతులు సహా పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. కస్తూరిరంగన్ నివేదికను తిరస్కరించాలని, మెట్రో ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి సాంకేతిక కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. మెట్రో ప్రాజెక్టు వ్యయంలో రాష్ట్రానికి సమాన వాటా ఇవ్వాలని, బెంగళూరులో 500 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాల లక్ష్యాన్ని చేరుకునేందుకు పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని కోరినట్లు వివరించారు. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ల నిర్మాణంపైనా మోదీతో చర్చించినట్లు చెప్పారు. బెంగళూరు అభివృద్ధి శాఖ మంత్రి కృష్ణ బైరేగౌడతో కలిసి నగర అవసరాలను ప్రధానికి వివరించామన్నారు. ఇతర ప్రాంతాల్లో రహదారులు 18-20 శాతం మేర ఉంటే బెంగళూరులో ఆ వాటా 8 శాతమేనని తెలిపారు. భూసేకరణకు చదరపు అడుగుకు సుమారు రూ.50 వేల పరిహారం చెల్లించాల్సి వస్తోందని, అయినా ఫ్లైఓవర్ల నిర్మాణ వ్యయంలో రాష్ట్రం వాటా భరించేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు. రాష్ట్ర డిమాండ్లపై అఖిలపక్ష బృందంతో ఢిల్లీకి వెళతానని పునరుద్ఘాటించారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై పూర్తి నివేదిక తీసుకున్న తర్వాత స్పందిస్తానని చెప్పారు. బెలగావిలోని సువర్ణ విధానసౌధ విద్యుత్ బిల్లుల బకాయిలపై మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్ అందుకుంటున్న రైతుల బిల్లులూ పెరిగాయని వివరించారు. వాటి మొత్తం రూ.20 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్లకు చేరిందన్నారు. కరవు కారణంగా రైతులు నీటి ట్యాంకులు నింపేందుకు ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్నారని, పరిస్థితిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంతరిక్ష రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే కీలక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం

మొదటి పేజి తరువాయి



లక్ష్యంగా పెట్టుకున్నట్లు లోకేశ్ తెలిపారు. వీటి ద్వారా రాకెట్ తయారీ, ప్రయోగాలకు అవసరమైన సహకారం అందుతుందన్నారు. హరిజాంటల్ ఇంటిగ్రేషన్‌లో విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం కీలకమని చెప్పారు. అకడమిక్ కరిక్యులమ్‌ను ఆధునీకరించడం, పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమన్నారు. పరీక్షలు, సర్టిఫికేషన్ సదుపాయాల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను అభివృద్ధి చేయాలని వివరించారు. ఇప్పటికే ఇంధన రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఐఐటీ తిరుపతితో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. ఆ ప్రాంతంలో ఇంగాట్, సోలార్, వేఫర్, సెల్ తయారీ సంస్థలు ఏర్పాటవుతున్నాయని చెప్పారు. అంతరిక్ష రంగానికి బలమైన పారిశ్రామిక పునాది : అంతరిక్ష పరిశ్రమలన్నింటినీ ఒకే వ్యవస్థలో అనుసంధానించే సమగ్ర విధానం దేశానికి అవసరమని మంత్రి లోకేశ్ అభిప్రాయపడ్డారు. స్పేస్ సిటీ అభివృద్ధికి కేంద్రం విధానపరమైన మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారు. అనంతరం రాష్ట్రాలు వేగంగా ముందుకెళ్లి స్ట్రెరూట్ వంటి సంస్థలతో పాటు విడిభాగాల తయారీదారులు, సరఫరాదారులను ఆకర్షించాలని చెప్పారు. ఈ రంగంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు విస్తృత అవకాశాలున్నాయని వివరించారు. ఇటీవల రాకెట్‌కు అవసరమైన షీల్డ్ తయారుచేసే ఒక ఎంఎస్ఎంఈ సంస్థను కలిశానని తెలిపారు. ఇలాంటి సంస్థలన్నింటినీ ఒకే ఎకోసిస్టమ్‌లోకి తీసుకురావడం ద్వారా అంతరిక్ష రంగానికి బలమైన పారిశ్రామిక పునాది ఏర్పడుతుందని చెప్పారు. ఏపీకి ప్రధాన బలం వేగంగా పనులు పూర్తి : కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీయే భాగస్వామ్య ప్రభుత్వాలు ఉండటం ఏపీకి అనుకూలమని లోకేశ్ తెలిపారు. రాష్ట్ర, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విధానాల్లో సానుకూల మార్పులకు కృషి చేసే అవకాశం ఉందన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీకి ఉన్న ప్రధాన బలం పనులను వేగంగా పూర్తి చేయడమేనని స్పష్టం చేశారు. యువత కెరీర్ అవకాశాల కోసం ఎదురుచూస్తోందని వారికి పరిశ్రమల ద్వారా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ అంతరిక్ష రంగంలో పాశ్చాత్య దేశాలు, చైనా ప్రయోగ వ్యయాన్ని తగ్గిస్తున్న తీరును పరిశీలించాలని సూచించారు. అంతరిక్ష ప్రయోగాల ఖర్చును గణనీయంగా తగ్గించేందుకు ప్రైవేటు రంగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి వ్యూహాన్ని రూపొందించాలన్నారు. ఇది ఈ రంగం మధ్యకాలిక, దీర్ఘకాలిక అభివృద్ధికి కీలకమని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0 : కేవలం ప్రోత్సాహకాలతో అంతరిక్ష రంగంలో బలమైన ఎకోసిస్టమ్‌ను నిర్మించలేమని లోకేశ్ తెలిపారు. విధానపరమైన స్పష్టతతో పాటు నాయకత్వం కలిగినవారు, పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థలు, పెట్టుబడిదారులను ఒకే వేదికపైకి తీసుకురావాలని చెప్పారు. వీరందరి మధ్య సమన్వయం ఏర్పడినప్పుడే పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0, ప్రతిపాదిత తిరుపతి స్పేస్ సిటీ ద్వారా అంతరిక్ష, ఏరోస్పేస్ పరిశ్రమలకు రాష్ట్రాన్ని కీలక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక లక్ష్యాన్ని నిర్దేశిస్తే దాన్ని సాకారం చేయడం తమ బాధ్యతని లోకేశ్ స్పష్టం చేశారు. ఈ చర్చలో ఇస్రో ఆస్ట్రోనాట్ ఎయిర్ కమోడోర్ ప్రశాంతి బి.నాయర్, అగ్నికుల్ సహ వ్యవస్థాపకుడు శ్రీనాథ్ రవిచంద్రన్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కే.ఎన్.సత్యనారాయణ, గెలాక్స్‌ఐ సీఈవో సుయాష్ సింగ్, స్ట్రెరూట్ ఏరోస్పేస్ ప్రతినిధి డాకా నాగ భరత్ పాల్గొన్నారు.

హసీనాను అలా తీసుకెళ్లాల్సిందే - బంగ్లాదేశ్ కు భారత్ కీలక షరతులు!

షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు పంపేందుకు భారత్ షరతులు విధించింది. భద్రత, న్యాయ విచారణకు హామీ ఇవ్వాల్సిందే అని స్పష్టం చేసింది.



బంగ్లాదేశ్ రాజకీయాల్లో మరో కీలక పరిణామానికి రంగం సిద్ధమవుతోందా? మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు మార్గం సుగమం అవుతోందా? రెండేళ్లకు పైగా భారత్ లో ఉంటున్న హసీనా డిసెంబరులో బంగ్లాదేశ్‌కు తిరిగొస్తానని ప్రకటించారు. అయితే ఆమె తిరుగు ప్రయాణానికి భారత్ కొన్ని కీలక షరతులు విధించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హసీనా ప్రాణాలకు రక్షణ, న్యాయపరమైన హక్కులకు భరోసా కల్పించాలని భారత్ భావిస్తున్నట్లు బీబీసీ బంగ్లా ప్రత్యేక కథనం వెల్లడించింది. ఈ విషయంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీలు వచ్చిన తర్వాతే తదుపరి అడుగులు పడే అవకాశముందని తెలిపింది.

రెండు ప్రధాన షరతులు

హసీనా తిరుగు ప్రయాణానికి సంబంధించి భారత్ రెండు ప్రధాన అంశాలపై హామీలు కోరుతున్నట్లు బీబీసీ బంగ్లా తన కథనంలో వెల్లడించింది. హసీనా 2024లో బంగ్లాదేశ్ సైనిక విమానంలో భారత్‌కు చేరుకున్న నేపథ్యంలో, తిరిగి స్వదేశానికి వెళ్లే ప్రక్రియలోనూ ఆ దేశ సైన్యమే కీలక బాధ్యత తీసుకోవాలని భారత్ భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం బంగ్లాదేశ్ సైనిక విమానాన్ని దిల్లీకి పంపి ఆమెను తీసుకెళ్లడం లేదా నిర్ణయించిన సరిహద్దు ప్రాంతంలో సైనిక అధికారులు ఆమెను స్వీకరించడం వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. అవసరమైన రవాణా, ఇతర ఏర్పాట్లకు భారత్ సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది.

న్యాయమైన విచారణకు అవకాశం

హసీనాకు బంగ్లాదేశ్ న్యాయస్థానం

పంచాయతీ ఎన్నికలపై ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ వ్యూహరచన



అనంతపురం, నవంబర్ 14, దరువు న్యూస్ :

రాప్తాడు నియోజకవర్గంలో జరగనున్న పంచాయతీ ఎన్నికలలో విజయమే లక్ష్యంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తును మరింత వేగవంతం చేశారు. శనివారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంతో పాటు రామగిరి మండలం వెంకటాపురంలోనూ ఆయా మండల, గ్రామ స్థాయి ముఖ్య నాయకులతో గ్రామాల వారీగా సమావేశమై చర్చలు జరిపారు. నియోజకవర్గ పరిధిలోని అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలలోని పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై నాయకులతో చర్చించారు. ఈ సమావేశాలలో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ప్రధానంగా ఆయా పంచాయతీల రిజర్వేషన్లను బట్టి రేసులో ఎవరెవరు ఉన్నారు, క్షేత్రస్థాయిలో ఎవరైతే బలమైన అభ్యర్థి అవుతారు అనే దానిపై ఆరా తీశారు. అంతేకాకుండా గత ఐదేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన విధేయత, నాయకుల సీనియారిటీతో పాటు పార్టీలో ఉత్సాహంగా పనిచేస్తున్న యువతకు అవకాశం కల్పించే అంశాలపై కూడా చర్చించి అభిప్రాయాలు సేకరించారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ, పార్టీలో ఎక్కడా విభేదాలకు తావులేకుండా బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేలా ఎమ్మెల్యే సునీత దిశానిర్దేశం చేశారు. అంతకుముందు, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో రాప్తాడు మండల జడ్పీటీసీగా ఘనవిజయం సాధించిన జయలక్ష్మి అనంతపురం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి గారిని ఎమ్మెల్యే అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు మనపై ఎంతో నమ్మకంతో పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, నిరంతరం ప్రజాసేవలో భాగమవ్వాలని సూచించారు. ఈ సమావేశాలలో ఆరు మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల వద్ద నిఘా నేత్రం : ఎస్పీ



ధర్మవరం నవంబర్ 14, దరువు న్యూస్ :

గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు ఆదివారం నుంచి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ధర్మవరం పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు.

ప్రతి కదలికపై పోలీసుల కన్ను!

నామినేషన్ల సందర్భంగా గ్రామాల్లో రాజకీయ ఉద్రిక్తతలు, వర్గ విభేదాలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ వెల్లడించారు. నామినేషన్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా ప్రతి కదలికను పర్యవేక్షించనున్నారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చోట అదనపు బలగాలను మోహరించేలా చర్యలు చేపట్టారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

నామినేషన్ల ప్రక్రియలో అభ్యర్థులు, వారి మద్దతుదారులు సంయమనం పాటించాలని పోలీసులు సూచించారు. ఇతర అభ్యర్థులను అడ్డుకోవడం, బెదిరింపులకు పాల్పడటం, గుంపులుగా చేరి ఉద్రిక్తతలు సృష్టించడం, గొడవలకు దిగడం వంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియ సాగేందుకు ప్రజలు, రాజకీయ నాయకులు, అభ్యర్థులు పోలీసుశాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు. ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల స్వీకరణ పూర్తయ్యేలా పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో

ఎన్నికల నియమావళిని తప్పనిసరి

- నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన
- అడిషనల్ ఎస్పీ అంకిత సురానా



బత్తలపల్లి, నవంబర్ 14, దరువు న్యూస్ :

గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని అడిషనల్ ఎస్పీ అంకిత సురానా సూచించారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, శనివారం ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని ముదిగుబ్బ, పట్నం, రామస్వామి తండా, గ్రామ సచివాలయాల వద్ద ఆదివారం జరగనున్న నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి చేపట్టిన భద్రతా ఏర్పాట్లను అడిషనల్ ఎస్పీ పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో ఇద్దరు ప్రతినిధులకు మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందని తెలిపారు. కేంద్రాల వద్ద ర్యాలీలు, ఊరేగింపులు, నినాదాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం, గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాల చుట్టూ 100 నుంచి 200 మీటర్ల పరిధిలో జనసమూహాలు గుమిగూడకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తూ పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో హిందూపురం డీఎస్పీ రవిబాబు, బత్తలపల్లి సీఐలు ప్రభాకర్ గౌడ్, సునీత, ఎస్ఐ సోమశేఖర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీఎం విజన్‌కు విశాఖ సీఐఐ పెట్టుబడుల

సదస్సు విజయవంతమే నిదర్శనం

- చంద్రబాబు దార్శనికత, నారా లోకేష్ కార్యాచరణతో ఏపీకి భారీగా పెట్టుబడులు
- 9.89 లక్షల కోట్ల పెట్టుబడులతో రాష్ట్ర పారిశ్రామిక రంగానికి నూతన దిశ
- 25 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- అనంతపురం అభివృద్ధికి కూడా పారిశ్రామిక పెట్టుబడులు, రక్షణ రంగ పరిశ్రమలు దోహదం చేస్తాయి.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్




అనంతపురం, నవంబర్ 14, దరువు న్యూస్ :

విశాఖపట్నంలో రెండు రోజుల పాటు ఘనంగా జరిగిన సీఐఐ అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, పాలనాదక్షతకు నిదర్శనమని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం, దార్శనికతకు, యువ నాయకుడు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కార్యాచరణ తోడవడంతో అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు ఆంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. విశాఖ సీఐఐ సదస్సు ద్వారా సుమారు రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదరడం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి గొప్ప ముందడుగు అని అన్నారు. ఈ పెట్టుబడుల ద్వారా లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని, రాష్ట్రంలో పారిశ్రామిక రంగం కొత్త పుంతలు తొక్కనుందని పేర్కొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, వేగవంతమైన అనుమతులు, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ భరోసా వంటి అంశాలు ఏపీని పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా నిలబెడుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు యువతకు 25లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందన్నారు. పరిశ్రమల స్థాపనతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ యువతకు మెరుగైన భవిష్యత్తును అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. అనంతపురం జిల్లాలోనూ రక్షణ రంగ పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కీలకమని ఎమ్మెల్యే దగ్గుపాటి పేర్కొన్నారు. పరిశ్రమలు వస్తే స్థానిక యువతకు ఉద్యోగాలు, వ్యాపారులకు ఉపాధి, రైతులకు అనుబంధ రంగాల్లో ఆదాయం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని విమర్శించారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవంతో రాష్ట్రానికి మళ్లీ పెట్టుబడుల విశ్వాసాన్ని తీసుకొస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని హితవు పలికారు. విద్యారంగంలోనూ కూటమి ప్రభుత్వం సమూల సంస్కరణలు చేపడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేశారని, విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిన జగన్‌రెడ్డి పాలనను ప్రజలు మరచిపోలేరని విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం అంటే కేవలం పారిశ్రామిక అభివృద్ధి మాత్రమే కాదు.. లక్షలాది కుటుంబాలకు ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించడం. సంపద సృష్టించి ఆ ఫలాలను పేదలకు అందించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పానికి విశాఖ సీఐఐ సదస్సు విజయవంతమైన నిదర్శనం. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తూ యువతకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు.

అభివృద్ధి, సంక్షేమం మాత్రమే కాదు..

ప్రజలకు సాయంలోనూ ముందున్నాం

- 37వ విడత సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- 7 మందికి 10.55 లక్షల రూపాయల చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే
- ఇప్పటివరకు 759మందికి 7.51 కోట్ల రూపాయల సీఎంఆర్ఎఫ్ సాయం



అనంతపురం, నవంబర్ 14, దరువు న్యూస్ :

కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి సంక్షేమం మాత్రమే కాకుండా ప్రజలకు ఆపద సమయంలో సాయం అందించడంలో కూడా ముందున్నామని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అర్బన్ టిడిపి కార్యాలయంలో ఆయన నేడు 37వ విడత సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 7 మంది లబ్ధిదారులకు 10.55 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కి, సీఎం చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారని అన్నారు. ఆపద సమయంలో ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్సలు పొందిన పేదలను సీఎం ఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నారన్నారు. తాజాగా 37వ విడతతో కలిపి ఇప్పటివరకు మొత్తం 759 మందికి 7,51 కోట్ల రూపాయల సహాయం అందించినట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో కోటి రూపాయలు కూడా అందించలేదన్నారు. ఓవైపు ప్రజల ఆరోగ్యంతో పాటు సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్నారన్నారు. గత ఐదేళ్లలో జగన్ రెడ్డి 10 లక్షల కోట్లు అప్పులు పెట్టి పోతే.. కూటమి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్లు అందిస్తున్నారని చెప్పారు. మంత్రి నారా లోకేష్ చొరవతో 20లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. పుట్టపర్తి వంటి ప్రాంతానికి యుద్ధ విమానాలు తయారు చేసే పరిశ్రమ వచ్చిందన్నారు. ప్రస్తుతం సీఐఐ సదస్సులో పెద్ద ఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వలనే జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో ఏపీని దేశంలోనే నెంబర్-1 స్థానంలో నిలుపుతారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

బాలల భవిష్యత్తుకు భరోసా ఇవ్వండి

- బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా ఆకాంక్ష
- పోలీస్ రక్షక్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు
- ఆటలు.. పాటలు.. పద్యాలతో అలరించిన చిన్నారులు





అనంతపురం, నవంబర్ 14, దరువు న్యూస్ :

వాళ్లంతా ముక్కు పచ్చలారని చిన్నారులు తమ ముద్దు ముద్దు మాటలు.. పాటలు.. నృత్యాలు.. పద్యాలు.. నాటికలతో చిన్నారులు అలరించారు. స్పానిష్ భాషలో తాము నేర్చుకున్న అంశాలను చక్కగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వేదికపై ఎలాంటి బెరుకు లేకుండా ఆత్మవిశ్వాసంతో ప్రదర్శనలు ఇచ్చి తమ ప్రతిభను చాటుకున్నారు. పోలీస్ రక్షక్ ప్రైమరీ స్కూల్‌లో శనివారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీ పి. జగదీష్ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్ లో ఈ వేడుకలు జరిగాయి. ఏఆర్ అదనపు ఎస్పి ఇలియాస్ భాష ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఆత్మవిశ్వాసంతో ప్రదర్శనలు

ఈ సందర్భంగా విద్యార్థులు పాటలు, నృత్యాలు, పద్యాలు, నాటికలు ప్రదర్శిస్తూ సందడి చేశారు. ముఖ్యంగా స్పానిష్ భాషలో తాము నేర్చుకున్న అంశాలను ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల ప్రదర్శనలను అధికారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించి అభినందించారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి

ఏఆర్ అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. వేదికపై ఎలాంటి భయం లేకుండా ధైర్యంగా తమ ప్రతిభను ప్రదర్శించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా ఉపాధ్యాయులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ బోధన అందించాలని సూచించారు. చిన్నారుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

అధికారుల అభినందనలు

కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కె.నీలకంఠరెడ్డి, అనంతపురం అర్బన్ డీఎస్పీ పి. కరుణాకరరావు, ఆర్ఐలు పవన్‌కుమార్ (అడ్మిన్), మధు (వెల్ఫేర్), పోలీస్ అధికారుల కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, రక్షక్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోగుల్లో సానుకూల దృక్పథం పెరిగేలా సేవలందించాలి : డీఎంహెచ్ఓ

అనంతపురం, నవంబర్ 14, దరువు న్యూస్ :

జిల్లాలోని 75 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ,సిబ్బంది అందించే సేవలు రోగుల సంతృప్తి స్థాయి పెరిగేలా, ఆరోగ్య కేంద్రాలపై సానుకూల దృక్పథం పెంపొందేలా సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం స్థానిక వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 86 ఆరోగ్య సూచకలలో అనంతపురం జిల్లా ఎనిమిదవ స్థానంలో ఉందని, అయితే రోగుల నమ్మకం పెంచే దిశగా మరింత కృషి జరగాలన్నారు. సిజేరియన్లు తగ్గించేందుకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగే విధంగా గర్భవతులను సన్నద్ధం చేయాలన్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న ఆరోగ్య సేవల ప్రచారం, అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఐదు దశలలో కూడా నూరు శాతం పోర్టల్ నమోదు జరగాలన్నారు. రాష్ట్రస్థాయిలో ముందుండే విధంగా సూచికల ప్రగతి సాధించాలని, ఏలాంటి నిర్లక్ష్యం, అలసత్వం సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి డాక్టర్ మనోజ్ కుమార్, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ విష్ణుమూర్తి, గణాంక అధికారి మొహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.





బాధ్యతలు ముందు.. ఆ నాకే ప్రమాణ స్వీకారం

పలువురిలో స్ఫూర్తి నింపుతున్న వైనం

డివిజన్ బాగోగులే తన లక్ష్యమంటున్న కార్పొరేటర్

బలరాం సేవలకు నీరా'జనం'

ప్రజాహితం కోరి ఆయన ప్రజాప్రతినిధి అయ్యాడు.. ప్రజా సమస్యలే కర్తవ్యం గా భావించాడు.. తానింకా బాధ్యతలు చేపట్టకనే.. తన డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారం కోసం నడుం బిగించాడు.. అతడే తాజా కార్పొరేటర్ బలరాం రావు.. తన డివిజన్ పరిధిలో తనకు ఓటేసి గెలిపించిన ఏ ఒక్కరు సమస్యలతో బాధ పడకూడదని ఆయన ఎన్నికల ముందు ప్రతిన పూనారు.. అదే నిజమని భావించిన 37వ డివిజన్ ఓటర్లు బ్రహ్మరథం పట్టారు.. తమకు అసలైన నాయకుడు బలరాం రావు అని భావించిన ఓటర్లు అఖండ మెజార్టీతో గెలిపించారు. అదే సమయంలో తన డివిజన్లో ప్రజలు తనపై ఉంచిన నమ్మకంతో తనను గెలిపించిన వారికి కృతజ్ఞతగా తన సేవలను ప్రారంభించిన తాజా కార్పొరేటర్ బలరాం రావు ఇంకా అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయలేదు అయితేనే సేవ చేయడానికి ప్రజలు తనకు కట్ట పెట్టిన బాధ్యతను గుర్తించి ఇప్పటికే వివిధ సమస్యలతో సతమతమవుతున్న డివిజన్ ప్రజల తలుపు తట్టాడు. వివరాల్లోకి వెళితే..





అనంతపురం, నవంబర్ 14, దరువు న్యూస్ :

అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి 37వ డివిజన్‌లో గెలుపొందిన కార్పొరేటర్ బలరాం రావు, ప్రమాణ స్వీకారం చేయకనే డివిజన్‌లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. డ్రైనేజీ కాలువల్లో మురుగునీటిని తీయించడం, విద్యుత్ తీగలకు అడ్డంగా పెరిగిన చెట్లను తొలగించడం వంటి పనులు చేపట్టి స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. డివిజన్‌లోని డ్రైనేజీ కాలువలు మురుగునీటితో నిండి, ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగించడంతో కార్పొరేటర్ బలరాం రావు తక్షణ చర్యలు తీసుకున్నారు. కాలువల్లో జమ అయిన మురుగునీటిని తొలగించి, పరిసరాల పరిశుభ్రతకు కట్టుబడ్డారు. అలాగే విద్యుత్ తీగలకు అడ్డంగా పెరిగిన చెట్లను తొలగించడం ద్వారా ప్రమాదాలను నివారించారు. ఎన్నికల తర్వాత వెంటనే ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడం, పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి చర్యలతో బలరాం రావు స్థానికుల మన్ననలు పొందుతున్నారు. డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, పరిశుభ్రమైన వాతావరణానికి కట్టుబడతానని వారు తెలిపారు. ప్రజలు కూడా 'శభాష్ బలరాం' అని ప్రశంసిస్తున్నారు. భవిష్యత్తులో డివిజన్‌లోని అన్ని సమస్యలపై దృష్టి సారించి, ప్రజల అవసరాలను ప్రభుత్వానికి అందించడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తానని కార్పొరేటర్ బలరాం రావు పేర్కొన్నారు. ప్రజా సేవకుడు అంటే ఇదిగో మన బలరామ్ ఉండాలని.. అనునిత్యం ప్రజాహిత కార్యక్రమాలలో ప్రజల మధ్యలో ఉంటూ ప్రజాసేవకే అంకితం కావాలని కోరుకోవడంలో అతిశయోక్తి కాదేమో..!









మరోసారి ఔదార్యం చాటుకున్న ఎమ్మెల్యే

- ఖాజా నగర్‌కు చెందిన రాముకు వీల్ చైర్ అందజేత

అనంతపురం, నవంబర్ 14, దరువు న్యూస్ :



అనంతపురం నగరంలోని ఖాజా నగర్‌కు చెందిన రాము బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతంకు గురికావడంతో నడవలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాము కుటుంబ సభ్యులు నేడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ని కలిసి రాము ఆరోగ్య పరిస్థితిని వివరించి, వీల్ చైర్ అందించాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రాముకు వీల్ చైర్‌ను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని పరిస్థితిలో ఉన్న రాముకు వీల్ చైర్ అందించడం ద్వారా ఆయనకు కొంత ఉపశమనం కల్పించారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తక్షణమే స్పందిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కి రాము కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఆశ్రమంలో విద్యార్థులకు అన్నదానం



అనంతపురం, నవంబర్ 14, దరువు న్యూస్ :

నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్ పర్సన్ డాక్టర్. ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్నదానం చేశారు. కోవూరు నగర్‌లో ఉన్న ఎయిమ్ ఫర్ సేవ, శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో ట్రస్ట్ సభ్యులు ఒకరి సహకారంతో కార్తీకమాసం సందర్భంగా శనివారం విద్యార్థులకు అన్నదానంతో పాటు స్నాక్స్, చాక్లెట్లు, బిస్కెట్లు అందించామని వారు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలమురళీ మాట్లాడుతూ.. ఆశ్రమాల్లోనూ ఇతర ప్రాంతాల్లోనూ ఉన్న నిస్సహాయులు, అనాధలు వారు తమకు ఎవరూ లేరనే ఆలోచనను వీడి సంతోషంగా తమతోనే అందరూ ఉన్నారని భావించాలన్నారు. ఆ దేవుడి ఆశీస్సులు అందరిపై ఉండి ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో సంతోషంగా ఉండాలని కోరుకుంటు న్నట్లు తెలిపారు. కార్తీక మాసంలో ఏ చిన్న పని చేసిన పుణ్యం వస్తుందన్నారు. బాధ్యతగా వీలున్న కొంతమంది అవసరంలోనూ ఆపదలోను ఉన్నవారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో స్వామి శ్రీ సత్యాత్మానంద, మేనేజర్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



ఇంకా వైసీపీపై విమర్శలా..?



- రూ.1,400 కోట్ల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయగలరా..?
- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటికి మేయర్ రమేష్ గౌడ్ సవాల్
- వైసీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించిన రమేష్ గౌడ్
- అనంత వెంకటరెడ్డి జిల్లాకు ఏం చేశారో మీ సీనియర్లను అడగాలి
- అనంతపురం మేయర్ రమేష్ గౌడ్

అనంతపురం, నవంబర్ 14, దరువు న్యూస్ :

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్న రేళ్లు గడిచినా.. అభివృద్ధిని పక్కన పెట్టి.. ఇంకా వైసీపీపై విమర్శలు చేయడం ఏంటని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను అనంతపురం నగర మేయర్ రమేష్ గౌడ్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా మేయర్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతతో పాటు వైసీపీ నాయకులపై దగ్గుపాటి చేస్తున్న విమర్శల మీద ఆయన స్పందించారు. అనంతపురం నగరాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ సిటీగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మాట్లా డటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గడిచిన రెండున్నరేళ్లుగా అభివృద్ధిని పక్కన పెట్టి మీరేం చేశారో ప్రజలంతా చూశారన్నారు. అందుకే మాకు మున్సిపల్ ఎన్నికల్లో పట్టం కట్టారన్నారు. 2019 నుండి 2024 వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నాయకత్వంలో కోవిడ్, వరదలు వంటి విపత్కర పరిస్థితులు ఉన్నప్పటికీ ఏకంగా రూ. 1,045 కోట్లతో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. గుత్తి రోడ్డు విస్తరణకు రూ.90 కోట్లు, బళ్లారి బైపాస్ నుండి పంగల్ రోడ్డు వరకు ఎన్ హెచ్-42 అనుసంధానానికి రూ.311 కోట్లు, కేవలం 18 నెలల్లోనే టవర్ క్లాక్ నాలుగు లైన్ల బ్రిడ్జి నిర్మాణం, నగరంలోని ప్రధాన రోడ్ల ఆధునీకరణకు రూ.68 కోట్లు, కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు రూ. 49.50 కోట్లు, శిథిలావస్థలో ఉన్న సీడీ ఆస్పత్రి పునరుద్ధరణతో పాటు ఆరు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం, అలాగే రాజీవ్ కాలనీ, రుద్రంపేట, నారాయణపురం వంటి విలీన ప్రాంతాలలో రూ.121 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత తమదేనని స్పష్టం చేశారు. నగరంలో రూ. 1,400 కోట్లతో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆ పనులకు సంబంధించి తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని మేయర్ రమేష్ గౌడ్ సవాల్ విసిరారు. గత ప్రభుత్వంలో మంజూరైన పనులను కూటమి అధికారంలోకి రాగానే రద్దు చేసి, మళ్లీ అవే పనులను తామే చేసినట్లు చెప్పుకోవడం ఏంటని ప్రశ్నించారు. దశాబ్దాల కల అయిన అనంతపురం సర్వజనాస్పత్రి విస్తరణకు తాము రూ.300 కోట్లతో శ్రీకారం చుడితే, నేడు ఆ పనులు ఎందుకు నిలిచిపోయాయో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టవర్ క్లాక్ రోడ్డు 2018లోనే మంజూరైందని ఎమ్మెల్యే చేస్తున్న వాదనలో వాస్తవం లేదని, ఆధారాలు చూపాలని సవాల్ చేశారు. దివంగత నేత అనంత వెంకటరెడ్డి గారి విగ్రహం గురించి మాట్లాడే ముందు, అనంతపురం జిల్లాకు ఆయన చేసిన సేవలు ఏమిటో కూటమిలోనే ఉన్న సీనియర్ నేతలు పయ్యావుల కేశవ్ ని కానీ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుని కానీ అడిగి తెలుసుకోవాలని మేయర్ హితవు పలికారు.

బాలల హక్కులు, భద్రత, సమగ్ర వికాసానికి సమాజం ప్రాధాన్యతనివ్వాలి : ఎస్కేయూ వీసీ

అనంతపురం, నవంబర్ 14, దరువు న్యూస్ :

ప్రతి చిన్నారికి ప్రేమపూర్వకమైన బాల్యం, భద్రత, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, సమాన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్వీ జ్యోతి కుమార్ పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, వారి సమగ్ర వికాసం, భావితరాల భవిష్యత్తు వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలను సమగ్రంగా చర్చిస్తూ రచయిత, పర్యావరణవేత్త భూమిపుత్ర శ్రీహరి మూర్తి రూపొందించిన 'ఆశల హరివిల్లు' పుస్తకం అభినందనీయమని అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక సంచికగా వెలువడిన ఈ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ.. బాల్యం ప్రతి వ్యక్తి జీవితానికి పునాది అని, చిన్ననాటి అనుభవాలు, విద్య, కుటుంబ వాతావరణం, సామాజిక పరిస్థితులు పిల్లల వ్యక్తిత్వ వికాసంపై గణనీయమైన ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. పిల్లల అభిప్రాయాలను గౌరవించడం, వారి ప్రశ్నలను ప్రోత్సహించడం, సృజనాత్మకతను వెలికితీయడం, ప్రతిభకు తగిన అవకాశాలు కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. రచయిత భూమిపుత్ర శ్రీహరి మూర్తి మాట్లాడుతూ.. 'ఆశల హరివిల్లు' పుస్తకంలో బాల్య ప్రాధాన్యత, బాలల హక్కుల పరిరక్షణ, సమగ్ర వికాసం, విద్య, ఆరోగ్యం, భద్రత, సమాన అవకాశాలు, ప్రకృతితో అనుబంధం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలను విస్తృతంగా చర్చించానని, ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల ఒప్పందం, భారత రాజ్యాంగం, బాలల రక్షణకు రూపొందించిన చట్టాలు, వాటి అమలులో ప్రభుత్వాలు, అధికారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం నిర్వహించాల్సిన పాత్రను వివరించానని అన్నారు. ప్రతి చిన్నారికి భయం లేని బాల్యం, నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన జీవనం, స్వేచ్ఛగా ఆడుకునే అవకాశం, తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచే గౌరవం లభించాలని ఈ పుస్తకం ఆకాంక్షిస్తోంది. పిల్లల కలలకు హద్దులు ఉండకూడదని, వారి ప్రతిభకు వివక్ష అడ్డుకాకూడదని, ప్రతి బిడ్డ తనదైన ప్రత్యేకతతో వికసించే వాతావరణం నిర్మించాల్సిన అవసరాన్ని రచయిత వివరించారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్వీ జ్యోతి కుమార్, విశ్వవిద్యాలయ ఫైనాన్స్ ఆఫీసర్ లోకేష్, నేచర్, వైల్డ్ లైఫ్ ఇనిషియేటివ్స్ సంస్థ ట్రస్టీ సిరిప్రియ, సంస్థ సభ్యులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయిత భూమిపుత్ర శ్రీహరి మూర్తి చేస్తున్న సాహిత్య, సామాజిక కృషిని అభినందించారు.



Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.